APTEL/25/A2844

# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 46 క్రిష్ణా, సోమవారం 10 - 11 - 2025 పేజిలు : 4 వెల. 2 /-

రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డ్ అందుకోనున్న మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా..

### కాచవరం ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇర్ఫాన్ పాషా..



**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,నవంబర్ 09(క్రైం కౌంటర్ డెస్క్):** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కాచవరం పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇర్ఫాన్ పాషా కు అరుదైన గౌరవం దక్కింది. ఉర్దూ అకాడమీ ఆంధ్రప్రదేశ్ జీవితకాల సాఫల్య అవార్డు కు ఇర్ఫాన్ పాషా ఎంపికయ్యారు. నవంబర్ 11వ తేది జాతీయ విద్యా దినోత్సవం మరియు భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని ఈ అవార్డును ఇర్ఫాన్ పాషాకు ప్రధానం చైయనున్నారూ.విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా అవార్డు అందుకోబోతున్నారు ఇర్ఫాన్. ఉర్దూ అకాడమీ వారు ప్రధానం చేసే ఈ అవార్డు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో పనిచేయుచున్న ఉర్దూ ఉపాధ్యాయుడు మొహమ్మద్ ఇర్ఫాన్ పాషాకు రావటం విశేషం. మొహమ్మద్ ఇర్ఫాన్ పాషా ఉర్దూ ఉపాధ్యాయుడు, విద్యారంగంలో అందించిన విశేష సేవలకు, విద్యా వ్యవస్థ అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి, పాఠశాలలో సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించి లైఫ్ టైం అచ్యుమెంట్ అవార్డును కు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## గోగులమూడి సత్యనారాయణరెడ్డి సంస్మరణ కార్యక్రమం లో ఘన నివాళు లర్పించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.



**ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, 09(క్రైం కౌంటర్ డెస్క్):**మైలవరం ప్రముఖులు, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ గోగులమూడి సత్యనారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. మైలవరం పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ దివంగత గోగులమూడి సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి ఆఖీఖా వేడుకకు ముఖ్య అతిధి గా విచ్చేసిన నందిగామ ఎమ్మెల్యే సౌమ్య..

### అక్షింతలు వేసి చిన్నారి ని ఆశీర్వదించిన ఎమ్మెల్యే..





**ఎన్టీఆర్ జిల్లా,కంచికచర్ల,నవంబర్ 09(క్రైం కౌంటర్ డెస్క్):** పరిటాల గ్రామంలో ఆదివారం నాడు షేక్ మొహమ్మద్ కుమార్తె షేక్ మిథత్ సుల్తానా ఆఖీఖా వేడుకకు కూటమినేతలతో కలిసి హాజరైన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య. ఎమ్మెల్యే రాకతో మరింత ఆనందహెూత్సవాల తో సాగింది వేడుక.వారి కుటుంబ సభ్యులతో కలిసి మిథత్ సుల్తానా కు అక్షింతలు వేసి ఆశీర్వదించారు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సౌమ్య.వేడుకకు హాజరైనా ఎమ్మెల్యే పట్ల కుటుంబ సభ్యులు కృత్షతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నారాయణరావుకు సీపీ బ్రౌన్ స్మారక అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 9 తెలుగు ఇంగ్లీష్ నిఘంటువు రూపకర్త, తెలుగు భాషాభ్యుదయానికి ఎనలేని సేవలందించిన సీపీ బ్రౌన్ జయంతిని రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గోకవరం బస్టాండ్ వద్ద డాక్టర్ కంటే వీరన్నచౌదరి హాస్పిటల్ ఆవరణలోని ఎస్వీ బాలు స్మారక సాంస్కృతిక మందిరంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డా క్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ ఆంగ్లేయులైనా సీపీ బ్రౌన్ తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. స్థా నిక గౌతమీ గ్రంథాలయంలో నేటి తరానికి పనికివచ్చే ఎన్నో వేల పురాతన తెలుగు పుస్తకాల డిజిటలైజేషన్ చేస్తూ, అంత్యప్రాస నిఘంటువును రూపుదిద్ది, వెలికితెచ్చిన అరిపిరాల నారాయణరావుకు బ్రౌన్ పురస్కారానికి ఎంపిక చేయడం ఎంతో సముచితమని అన్నారు.

# పవన్ కళ్యాణ్ పలమనేరు పర్యటనలో అపశ్రుతి



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్తూరు జిల్లా పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం రోజున పలమనేరు మండలంలోని ముసలిమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని పవన్ కళ్యాణ్ సందర్శించారు. అయితే పవన్ కళ్యాణ్ ముసలిమడుగు పర్యటనలో అనుకోని ఘటన జరిగింది. పవన్ కళ్యాణ్ కారు కిందపడి ఓ మహిళకు గాయాలయ్యాయి. పవన్ కళ్యాణ్ ముసలిమడుగు వస్తున్నారనే సమాచారంతో ఆయనను చూసేందుకు అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. అయితే పవన్ కళ్యాణ్ కాన్వాయి వచ్చిన సమయంలో ఒక్కసారిగా వారి మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలోనే హేమలత అనే మహిళ కిందపడగా.. ఆమె కాలిపై నుంచి పవన్ కళ్యాణ్ కారు వెళ్లింది. ఈ ఘటనలో హేమలతకు గాయాలు కాగా.. పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో హేమలత కాలు ఫ్రాక్చర్ అయినట్లు వైద్యులు తెలిపారు. మరోవైపు పలమనేరు పర్యటనలో ముసలిమడుగులోని కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని పవన్ కళ్యాణ్ సందర్శించారు. ఈ ఏనుగుల కేంద్రాన్ని 20 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఇక కర్ణాటక నుంచి తెచ్చిన నాలుగు కుంకీ ఏనుగులను ఇందులో ఉంచారు. ఇక్కడే వీటికి ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ కుంకీ ఏనుగుల ద్వారా పొలాలు, జనావాసాల్లోకి వచ్చే అడవి ఏనుగులను కట్టడి చేయనున్నారు. మరోవైపు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కుంకీ ఏనుగుల విన్యాసాలను తిలకించారు. ఏనుగులకు ఆహారం తినిపించారు. ఏనుగుల శిక్షణ, సంరక్షణ వంటి అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక ముసలిమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రంలో కర్ణాటక నుంచి తెచ్చిన నాలుగు కుంకీ ఏనుగులతోపాటు.. ఇదే శిక్షణ కేంద్రంలో ఉన్న మూడు కుంకీ ఏనుగులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా కుంకీ ఏనుగులతో ఏర్పాటుచేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్‌కు కుంకీ ఏనుగులు సెల్యూట్ చేయడం ఆకట్టుకుంది. అలాగే అడవిలోని కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటకు తీసుకువస్తారు.. మదపుటేనుగులను కుంకీ ఏనుగుల సాయంతో ఎలా నియంత్రిస్తారనే దానిపై కుంకీ ఏనుగులతో చేయించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మదపుటేనుగులు అదుపు తప్పినప్పుడు వాటికి ప్రత్యేకంగా మత్తు ఇచ్చి.. కోపాన్ని ఎలా అణిచి వేస్తారనేది మావటీలు పవన్ కళ్యాణ్‌కు చూపించారు. అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ముసలమడుగులో ఏర్పాటు చేసిన నూతన ఏనుగుల క్యాంపును పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఏనుగుల క్యాంపులో ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి పునాదిరాయి వేశారు.

## ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే భాను ప్రకాష్ దృష్టి పెట్టాలి... మాజీ మంత్రి రోజా



నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ ప్రజల సమస్యలను పక్కన పెట్టి ఇతర విషయాలపై దృష్టిపెడుతున్నారని మాజీ మంత్రి రోజా ఆదివారం విమర్శించారు. ప్రజల సంక్షేమం కంటే ఇసుక, మట్టి, రోడ్డు కాంట్రాక్టర్ల వద్ద నుంచి వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇంటికే రేషన్ అందించగా, ఇప్పుడు ఆ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రజల కోసం పనిచేయాల్సిన నాయకుడు, దోపిడీపై శ్రద్ధ పెడితే అభివృద్ధి ఎలా జరుగుతుందని ఆమె ప్రశ్నించారు.

## "భారత్‌లో ఉగ్రవాదానికి పాకిస్థాన్ ఐఎస్ఐ -1 యూనిట్ మద్దతు?"

రెండు దశాబ్దాల క్రితం జరిగిన ముంబై పేలుళ్ల నుంచి ఇటీవల పహల్గాం దాడి వరకుపాక్ ప్రేరేపిత ఉగ్రవాదం కారణంగా ఎన్నో నిరపరాధులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడుల వెనుక పాకిస్థాన్ ప్రమేయం ఉందన్న విషయం అందరికీ తెలిసిందే.అయితే, ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కుట్రల వెనుక పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ (%×ж×%)కి చెందిన ఓ అత్యంత రహస్య విభాగం కీలక పాత్ర పోషిస్తోంది. దాదాపు 25 ఏళ్లుగా భారత్‌లో సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ఈ విభాగాన్ని "ఎస్1 యూనిట్" (%ж1 ఖఱఅ%) అని పిలుస్తారు.జాతీయ మీడియా కథనాల ప్రకారం, భారత్‌లో ఉగ్రవాద వ్యాప్తికి ప్రధాన కేంద్రంగా ఈ యూనిట్ పనిచేస్తోంది. తాజాగా భారత ఇంటెలిజెన్స్ సంస్థలు దీని పూర్తిస్థాయి కార్యకలాపాలను గుర్తించాయి. పాక్ ఆర్మీకి చెందిన కల్నల్ స్థాయి అధికారి ఈ యూనిట్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఇతడితో పాటు "గాజీ-1", "గాజీ-2" అనే కోడ్ పేర్లతో మరో ఇద్దరు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి ఆపరేషన్లను పర్యవేక్షిస్తున్నారు.ఇస్లామాబాద్‌లో ఈ యూనిట్ ప్రధాన కేంద్రం ఉందని సమాచారం. మాదకద్రవ్యాల వ్యాపారం ద్వారా వచ్చే డబ్బు ఈ యూనిట్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉపయోగపడుతోందని వర్గాలు చెబుతున్నాయి. ఎస్1 యూనిట్ సభ్యులు బాంబులు, ఐఈడీలు తయారు చేయడంలో నిపుణులు. ఆయుధ వినియోగంలో కూడా వీరికి విశేష నైపుణ్యం ఉంది. భారత సరిహద్దు ప్రాంతాలు, ముఖ్య పట్టణాలకు సంబంధించిన వివరమైన మ్యాప్‌లు వీరి వద్ద ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని సమాచారం.ఎస్1 యూనిట్ ఉనికి గురించి భారత వర్గాలకు చాలాకాలంగా తెలిసినా, దాని కార్యకలాపాల పూర్తి వివరాలు తాజాగా బయటపడ్డాయి. ఈ యూనిట్ సభ్యులు జైష్-ఏ-మహ్మద్, లష్కర్-ఏ-తయ్యిబా వంటి ఉగ్ర సంస్థల శిక్షణ శిబిరాల్లో తరచూ పాల్గొంటారని చెబుతున్నారు.



## కిక్కిరిసిన సత్యదేవుడి సన్నిధి



అన్నవరం, నవంబరు 9 ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తజనసందోహంగా మారింది. వేకువజామున 2గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు ప్రారంభించగా సాయంత్రం 4 గంటల వరకు నిరంతరాయం గా రద్దీ కొనసాగింది. ఒక దశలో క్యూలైన్లు, వ్రతమండపాలు కిక్కిరిసి నిండిపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్ప డింది. వాహనాల పార్కి ంగ్‌తో గందరగోళ పరిస్థితులు రావడంతో ఎస్ఐ హరిబాబు కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలను కొండదిగువ కళాశాల మైదానంలో పార్కింగ్ చేయించి కొండదిగువ నుంచి ఉచిత బస్సుసౌకర్యం కల్పించారు. సుమారు 90వేలమందిని స్వామిని దర్శించుకోగా సత్యదేవ నిత్యన్నదాన పథకం ద్వారా 25వేలమందికి ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 2 గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉ ండాల్సి వచ్చింది. చైర్మన్ రోహిత్ దగ్గరుండి ఎటువంటి తోపులాటలు జరగకుండా పర్యవేక్షించారు. ఆదివారం ఒక్కరోజు 9వేల జంటలు సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షలు ఆదాయం లభించింది. భక్తుల రద్దీతో అంత్రాలయం దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. దిగువభాగంలో ఉన్న యంత్రాలయం సాయంత్రం వరకు పూర్తిగా నిలిపివేశారు. ఈవో సుబ్బారావు సత్యగిరికొండ, వ్రత మండపాలలో తిరుగుతూ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. కాగా రత్నగిరిపై కార్తీక సోమవారం జరిగే కార్య క్రమాలకు హాజరయ్యేందుకు ఆదివారం రాత్రే భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. వసతి గదులు సరిపడక ఆరుబయట విశ్రమించారు.

# పంచారామాలకు ప్రత్యేక బస్సులు



పంచారామాల క్షేత్ర దర్శినికి సంబంధించి మూడు ప్రత్యేక సర్వీసులు ఆదివారం సాయంత్రం ద్వారకాబస్‌స్టేషన్ నుంచి బయల్దేరాయి. ఉన్నతాధికారులు భక్తులను బస్సెక్కించారు. సోమవారం ఉదయం అమరావతి చేరుకుంటాయి. అక్కడ అమరేశ్వరుని దర్శనానంతరం భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలకు చేరుకుంటాయి. ఆయా ఆలయాల్లో భక్తులు శివదర్శనం చేసుకున్న తరువాత సోమవారం రాత్రికి తిరిగి ద్వారకాబస్‌స్టేషన్‌కు చేరుకుంటాయి. ఈ సర్వీసులు శని, ఆదివారాల్లో నడుపుతున్నట్టు ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. 35 మంది భక్తులు బృందంగా పంచారామాలకు వెళ్లాలనుకుంటే ఏరోజైనా ప్రత్యేక బస్సు నడుపుతామన్నారు.

**పుట్టపర్తికి ప్రత్యేక సర్వీసులు**

పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల సందర్భంగా ఈనెల 19 నుంచి ఐదు రోజుల పాటు ద్వారకాబస్‌స్టేషన్ నుంచి పుట్టపర్తికి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు ఏసీ, నాన్ ఏసీ సర్వీసులు నడుపుతామని ఆర్ఎం వెల్లడించారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

**నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు**

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కార్యకమాన్ని రద్దుచేసినట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తెలిపారు. ఈనెల 14,15 తేదీల్లో నగరంలో న్విహించనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమైనందున పీజీఆర్ఎస్ రద్దుచేస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా నిర్వహిస్తామన్నారు. ఇవే కారణాలతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, పోలీస్ కమిషనరేట్‌లో జరగాల్సిన పీజీఆర్ఎస్‌ను రద్దుచేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్, సీపీ తెలిపారు.

**నేటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు**

**జిల్లాలో 1.85 లక్షల మంది విద్యార్థులు**

**ఎంఆర్సీ, క్లస్టర్ కాంప్లెక్స్‌లలో ప్రశ్నపత్రాలు**

జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు జరగనున్నాయి. తొలి రోజు సోమవారం ఉన్నత పాఠశాలల విద్యార్థులు, మంగళవారం నుంచి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయిజ

ఈనెల 19వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు 76 వేలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1.09 లక్షలు వెరసి 1.85 లక్షల మంది రాయనున్నారు. ఒకటి నుంచి ఐదు, ఎనిమిది నుంచి పదోతరగతి వరకు విద్యార్థులకు ఉదయం, ఆరు, ఏడు తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఈనెల 11న తెలుగు, 12న ఇంగ్లీష్, 13న గణితం, 14న ఈవీఎస్, 15న ఓఎస్ఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లీష్, 13న గణితం, 14న జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, 15న బయాలజీ సైన్స్, 17న సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగుతాయి. ఓరియంటల్ పాఠశాలల విద్యార్థులకు 18వ తేదీన సంస్కృతి/హిందీ/అరబిక్/పర్షియాలో పేపర్ 1, 19 పేపరు-2 పరీక్ష నిర్వహిస్తారు.

ఒకటోతరగతి నుంచి ప్రతి పేపరు 80 మార్కులు, పదోతరగతిలో 100 మార్కులకు ప్రశ్నపత్రాలను ఎస్సీఈఆర్టీ రూపొందించి జిల్లాలకు పంపింది. ఉన్నత పాఠశాలల ప్రశ్నపత్రాలు మండల రిసోర్స్ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల ప్రశ్నపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్‌లలో భద్రపరిచారు. ప్రతి రోజు పరీక్ష ప్రారంభానికి గంట ముందు పాఠశాలలకు ప్రశ్నపత్రాలు అందజేయాలని విద్యాశాఖ ఆదేశించింది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలనిఎంఈవో/ప్రధానోపాధ్యాయులకు సూచించింది. ఈనెల 25వతేదీలోగా జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తిచేసి నెలాఖరులోగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని ఆదేశించింది. జిల్లాలో సమ్మేటివ్ పరీక్షలకు సంబంధించి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో ప్రేమ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు.

**పోలీస్‌స్టేషన్‌లో యువతి ఆత్మహత్యాయత్నం**

**ప్రియుడితో పెళ్లి చేయలేదని మనస్తాపం**

**ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు**

ప్రేమించిన వాడితో పోలీసులు పెళ్లి చేయలేదనే మనస్తాపంతో ఓ యువతి గాజువాక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.


అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి చెందిన యువతి, అనకాపల్లికి చెందిన వీరయ్యస్వామి అచ్చుతాపురంలోని ఓ సంస్థలో పనిచేసేవారు. ఈ క్రమంలో వారిద్దరిమధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. కొంతకాలం తరువాత యువతి అచ్చుతాపురంలో పని మానేసి గాజువాకలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తూ శ్రీనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఏడేళ్ల పాటు కలిసి తిరిగిన వీరయ్యస్వామి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో పది రోజుల కిందట గాజువాక పోలీసులను ఆశ్రయించింది. దీనిపై ఆదివారం పోలీసులు ఇద్దరినీ పిలిపించారు. ఈ క్రమంలో యువతి వీరాస్వామితో తనకు పెళ్లి చేయాలని పట్టుబట్టింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తుండగానే హ్యాండ్‌బ్యాగ్‌లోని నెయిల్ పాలిష్ తీసుకుని తాగేసింది. వెంటనే పోలీసులు ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాజువాక సీఐ ఎ.పార్ధసారధి ఆస్పత్రికి వెళ్లి యువతిని విచారించారు. అయితే ప్రియుడిపై ఫిర్యాదు చేయడానికి ఆమె నిరాకరించి, పెళ్లి చేయాలని మాత్రమే పట్టుబడుతుండడంతో వీరయ్యస్వామితో చర్చిస్తున్నారు.

## ఐక్యతకు ప్రతీకలు



దివాన్‌చెరువు, నవంబరు 9 : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం వనసమారాధనలు ఉత్సాహంగా సాగాయి. పలు సామాజిక వర్గాల వారు జోరుగా హుషారుగా వనసమారాధనలలో పాల్గొన్నారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనంలో బ్రాహ్మణ ఉద్యోగుల సేవా సమూహం (బెస్ట్) వనసమారాధన నాయకులు కాశీవఝుల శ్రీనివాస్, కేఎన్‌బీ లక్ష్మి, మాంధాత రామకృష్ణ, కంభంపాటి రామగణేష్, వక్కలంక త్రినాథకుమార్ నాయకత్వంలో జరిగింది. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. ఐసీడీఎస్ రాష్ట్ర అసోసియేషన్ నాయకుడు ధర్మాల శ్రీకాంత్‌రాజు మాట్లాడుతూ బెస్ట్ సమూహం ఉద్యోగ మిత్రులను నమోదు చేసుకుని తరచుగా సమావేశాలు నిర్వహించుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే గౌతమీ ఘాట్ వాకర్స్, యోగా వెల్ఫేర్ అసోసియేషన్ వనసమారాధన నిర్వహించుకుంది. ఈ వన భోజనాలకు వచ్చిన జనంతో పుష్కరవనం సందడిగా మారింది. అలాగే దివాన్‌చెరువు-శ్రీరాంపురం మధ్య తోటల్లో జరిగిన కాపునాడు కార్తీక వనసమారాధనకు హాజరైన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ యువత విద్య, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ సత్యనారాయణ, యర్రా వేణుగోపాలరాయుడు, బొర్లపూడి క్రాంతి, మజ్జి పద్మ, జక్కంపూడి విజయలక్ష్మి, ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిలారెడ్డి హాజరయ్యారు. వారిని కాపునాడు జోన్-2 అధ్యక్షుడు గుదే రఘునరేష్, ముమ్మిడి వీరబాబు, దేశినీడి రాంబాబు, కాళ్ల చక్రరావు, రుద్రప్రసాద్, ర్యాలి రామకృష్ణ, పిల్లా ప్రసాద్, గోపిశెట్టి విజయలక్ష్మి, దుర్గాదేవి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పిల్లలకు, పెద్దలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# రియల్ ఎస్టేట్ గేమ్ ఛేంజర్‌గా 6 వరుసల జాతీయ రహదారి..భూముల ధరలు రెక్కలు



కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో అనేక మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరిగింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారులో టీడీపీ, జనసేన పార్టీలు కీలక భాగస్వామ్యులుగా ఉండటంతో రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి తగిన మద్దతు లభిస్తోంది. మరోవైపు మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంతో ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటూ ఉండటంతో .. ఆయా ప్రాంతాల్లో భూములకు మంచి డిమాండ్ వస్తోంది. తాజాగా విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణపై అధికారులు దృష్టి సారించారు. విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే కన్సల్టెన్సీ సంస్థ సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా రూపొందించింది.

అయితే విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులు పట్టాలెక్కితే విజయవాడ శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఉయ్యూరు లాంటి ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ పుంజుకోవడానికి ఈ ప్రాజెక్టు గేమ్ ఛేంజర్ అవుతుందని చెప్తున్నాయి. పరిశ్రమలు విస్తరించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో ఈ ప్రాంతంలో ఆస్తి విలువలు పెరుగుతాయని, ఇళ్లకు డిమాండ్ ఏర్పడుతుందని.. అలాగే ఈ ప్రాంత జీవనశైలిలోనూ మార్పులు వచ్చే అవకాశాలు ఉందంటున్నారు. ప్రస్తుతం విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి -65 ముఖ్యమైన మార్గంగా ఉంది. విజయవాడను పోర్టు సిటీ అయిన మచిలీపట్నంతో కలిపే రహదారి ఇదే. అయితే పరిశ్రమలు, లాజిస్టిక్స్, వాణిజ్యం పెరిగే కొద్దీ, ఈ రహదారిపై వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించారని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఉ ండవని, ప్రయాణం మరింత వేగంగా, సౌకర్యవంతంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు.

ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే ఈ కారిడార్ వెంబడి ఖరీదైన విల్లాలు, కమర్షియల్ హబ్స్, నివాస ప్రాంతాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.దీంతో విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ కారణంగా ఉయ్యూరు వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతుల నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో భూములకు మంచి డిమాండ్ ఏర్పడుతుందని చెప్తున్నారు.

# ప్రజలతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలి

ప్రజలతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని పోలీసులకు ఎస్పీ దామోదర్ పిలుపునిచ్చారు.ఆదివారం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అ?ధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీసుస్టేషన్ రికార్డులు, సీడీ ఫైళ్లను పరిశీలించారు పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులు, వృద్ధులు, మహిళలతో ఆప్యాయంగా పలకరించి, వారి సమ స్యలను శ్రద్ధగా విని, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సంతకవిటి పోలీసు స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ తనిఖీచేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం పట్టణ సీఐ ఆశోక్‌కుమార్, ఎస్ఐ ఆర్.గోపాలరావు, ఏఎస్సై ఎమ్.వాసు దేవరావు పాల్గొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి రౌడీ యాక్టివిటీస్ చేసే వారికి లాఠీ పోలీసింగ్ ఉంటుందని ఎస్పీ ఆర్.దామోదర్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు. బాడంగి పోలీసుస్టేషన్ పరిస రాలను ఎస్పీ దామోదర్ పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, బొబ్బిలిరూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ తారకేశ్వరరావు పాల్గొన్నారు.జిల్లాలో గంజాయి అక్రమ రవాణాదారులపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజాంలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని సీఐ అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ దామోదర్ కోరారు.

# ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం సిబ్బంది నియామకం పూర్తి

పార్వతీపురం/గరుగుబిల్లి, నవంబరు9 జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రవాణా, హమాలీలు, వాహనాలు గోనె సంచులను సిద్ధం చేశారు. అవసరమైన సిబ్బందిని కూడా నియమించారు. ఏదేమైనా వచ్చేవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు అధికా రులు వెల్లడిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. కాగా రైతుసేవా కేంద్రాల నుంచి ఈ సీజన్‌లో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పీఏసీఎస్‌లు, ఆర్ఎస్‌కేల వద్ద సుమారు 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీపీసీ)ను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ముగ్గురు చొప్పున టీఏలు, డీఈవోలు, సహాయకులను నియ మించారు.ధాన్యం కొనుగోలు , ఇతర అంశాలపై ఇప్పటికే వారికి శిక్షణ అం దించారు. వారు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. కొన్నిచోట్ల ఆర్ఎస్‌కే నుంచి పీపీసీ మధ్య 24,776.8 కిలో మీటర్ల మేర దూరం ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా రవాణా, హమాలీలను సిద్ధం చేశారు. మొత్తంగా 2.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ముందస్తు కొనుగోలుకు అధికారులు నిర్ణయించారు.

పర్యవేక్షణకు సిబ్బంది

ఆర్ఎస్‌కేలో రైతులు ధాన్యం అప్పగించిన తర్వాత అవి రైస్ మిల్లులకు చేరే వరకు ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షించనున్నారు. తహసీల్దార్, సివిల్ సప్లైస్ డీటీ, ఏవో, వీఆర్వో, వ్యవసాయ సిబ్బంది, ఇతర సచివాలయాల సిబ్బంది పర్యవేక్షణలో ధాన్యం తరలింపు జరగనుంది.

వాహనాలకు రిజిస్ట్రేషన్

జిల్లాలోని 180 కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ధాన్యం తరలింపు వాహ నాల రిజిస్ట్రేషన్లు పూర్తికావచ్చాయి. ఆర్ఎస్‌కేల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించనున్నారు.

పీఏసీఎస్‌ల్లో పాత సంచులు

ప్రస్తుతం 21 లక్షలకు పైగా గోనె సంచులను సిద్ధం చేశారు. అయితే గతేడాది సమస్యలు పునరావృతం కాకుండా రైతులకు నాణ్యమైన సంచులు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. దీంతో మిల్లర్లు కొత్తవి కొన్నారు. ఇటీవల జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి పార్వతీపురం మండలం అడ్డాపుశీల వద్ద రైస్ మిల్లులో గోనె సంచులను పరిశీలించారు. అయితే జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పాత గోనె సంచులే దర్శనమిస్తున్నాయి. అధిక శాతం పనికి రాని విధంగా తయార య్యాయి. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



టార్పాలిన్లు సిద్ధం

రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల్లో టార్పాలిన్లు సిద్ధం చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో వర్షాలు కురిసినట్లయితే నిల్వలు తడిసిపోకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు.

ముంచిన తుఫాన్..

మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో చాలాచోట్ల ధాన్యం నిల్వలు తడిసిపో యాయి. దీంతో రైతులు వాటిని ఇతర జిల్లాల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు 80 కిలోల కామన్ రకం ధాన్యం బస్తాను రూ.1350కు కొనుగోలు చేస్తున్నారు. పార్వతీపురం, బలిజిపేట, పాలకొండ తదితర మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఆరబెట్టిన ధాన్యానికి మరో రూ.వంద అదనంగా జోడించి వ్యాపారులు రైతులకు చెల్లిస్తున్నారు. పంటను నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులకే ధాన్యం విక్రయిం చాల్సి వస్తోంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో వచ్చేవారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. ఈ లోపు రైతులు తొందరపడకుండా ఉంటే వారి శ్రమకు తగిన ఫలితం దక్కుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రారంభమైన వరి కోతలు మక్కువ రూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమ య్యాయి. ఈ నెలాఖరుకు ఇది పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మక్కువ మండలంలో సుమారు 12వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టగా.. 25వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. కాగా గిరిజన ప్రాంతాల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేయనున్నారు.

# పాడిరైతులకు తప్పని కష్టాలు



అమడగూరు, నవంబరు 9కరువు ప్రాంతమైన అమడగూరు మండలంలో వ్యవసాయంతో రైతులు ప్రతి యేటా నష్టాలు చవి చూస్తున్నారు. దీంతో పె ట్టుబడులు పెట్టి పంటలు సాగుచేయలేక, పంటలు సాగిచేసినా పెట్టుబడులు తిరిరాని పరిస్థితిలో కొట్టుమిట్టాడు తున్నారు. దీంతో చాలామంది రైతులు రైతులు పాడిపరిశ్రమపై మక్కువ చూపుతున్నారు. ఎవరి శక్తి వారు రెండు లేదా నాలుగు ఆవులు, గేదెలు పెట్టుకొని పాలవ్యాపారం చేస్తున్నారు. డెయిరీలకు పాలు పోస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో రెండు పశు వైద్యశాలలు ఉన్నాయి. అయితే వాటి వద్దకు ఎప్పుడు వెళ్లినా పశు వైద్యులు కనపడరు. దీంతో మండల ప్రజలు పశు వైద్యం గురించి ఎవరిని అడగాలో తెలియన అయోమయ స్థితిలో పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండకేంద్రంలోని పశు వైద్యులు ధనుంజయులు బదిలీపై వెళ్లారు. దీంతో తనకల్లు మండలంలోని బొంతలపల్లి పశవైద్య కేంద్రం పశువైద్యులు హరినాథ్‌రెడ్డి ఇనచార్జ్ వైద్యుడిగా ఇక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ఆయన వారంలో ఒక రోజు అమడగూరుకు వచ్చి వెళుతుంటారని రైతులు తెలిపారు. దీంతో పశువులకు ఏ వ్యాధి వచ్చినా ప్రైవేటుగా మందులు కొనాల్సిందే. పశువైద్యశాలకు వెళ్లి మందు లు అడిగితే ఇంటికి ఇచ్చేందుకు కుదరదు, ఇక్కడికే పశువులను తీసుకొస్తే మందులు ఇచ్చి చూస్తామని సిబ్బంది చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఆవులు 5403, గేదెలు 346, గొర్రెలు 57675, మేకలు 9280, ఇతర పశు వులు 1570 ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబు తున్నాయి. వీటికి సేవలు అందించేందుకు పంచాయతీకి ఒకరు చొప్పున వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమిం చారు. అయితే డబ్బులు చెల్లిస్తే తప్ప వారు వైద్యం అందించరనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. మండలంలో పశువైద్యంపై ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు అంటున్నారు. వైద్యులను నియమించి అన్ని వేళలా అందుబాటులో ఉ ండేలా చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

పశువైద్యుడిని ఏర్పాటు చేస్తాం - కేశవయ్య, ఏడీ

డాక్టర్ లేనిది వాస్తవమే, పంచాయతీకొక వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నా రు. ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు, వైద్యుడిని కూడా ఏర్పాటు చేసి పాడి రైతులకు అవసరమ్యే మందులు అందించి ఇబ్బంది లేకుండా చూస్తాం.

# వీధికుక్కలపై మల్లగుల్లాలు! తరలింపు సాధ్యాసాధ్యాలపై చర్చ



**సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్యలకు సిద్ధమవుతున్న జీవీఎంసీ అధికారులు**

**నగరంలో సుమారు రెండు లక్షల వీధికుక్కలు**

**వాటికి ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటుకు లక్ష కెన్నెల్స్ అవసరం**

**భారీగా బడ్జెట్, సిబ్బందిని నియమించాలి**

**గణాంకాలతో సిద్ధమవుతున్న జీవీఎంసీ అధికారులు**

'ఆస్పత్రులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, విద్యాసంస్థల్లో వీధికుక్కలు కనిపించడానికి వీల్లేదు. రెండువారాల్లోగా వాటన్నింటిని రీహాబిలేటషన్ సెంటర్లు, ఫీడింగ్ సెంటర్లకు తరలించాలి. వీధుల్లో తిరిగే కుక్కలను ఆపరేషన్ తర్వాత తిరిగి పట్టుకున్నచోట విడిచిపెట్టకుండా, రీహాబిలిటేషన్ సెంటర్‌లోనే ఉంచాలి.' రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలకు సుప్రీంకోర్టు తాజాగా జారీచేసిన ఆదేశాలివి...

సుప్రీంకోర్టు ఆదేశంతో వీధికుక్కల నియంత్రణపై అధికారులు మల్లగుల్లాలుపడుతున్నారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం రెండు లక్షల వరకు వీధికుక్కలు ఉంటాయని అంచనా. ఇవన్నీ వీధులు, ఆస్పత్రులు, బస్టాండ్‌లు, ఖాళీ స్థలాలు, పార్కుల్లో సంచరిస్తుంటాయి. తరచూ ఎక్కడో ఒకచోట చిన్నారులు, మహిళలు, రోడ్లపై నడుచుకుంటూ వెళ్లేవారిని, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని కరుస్తుంటాయి.బాధితులు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, అర్బన్‌హెల్త్‌సెంటర్లకు వెళ్లి యాంటీరేబిస్ వ్యాక్సిన్లు (ఏఆర్‌వీ) వేయించుకుంటారు. కొన్నిసార్లు కుక్కకాటుని నిర్లక్ష్యం చేయడం, సరియైన్న విధానంలో వాక్సిన్ తీసుకోకపోవడం వంటి కారణాలతో రేబిస్ సోకి మృత్యువాతపడుతున్నారు. నగరంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కేజీహెచ్, ఘోషాస్పత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి, ప్రాంతీయ కంటిఆస్పత్రి, టీబీ ఆస్పత్రుల ఆవరణలోకి వీధికుక్కలు చొరబడి స్వైరవిహారం చేస్తున్నాయి. వివిధ రుగ్మతలతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చేవారితోపాటు వారి సహాయకులను కాటేస్తున్నాయి. ద్వారాకా, మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్, బస్‌షెల్టర్లలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. నగరంలో ప్రతి చోటీ వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు జీవీఎంసీ ఏటా రూ.15 లక్షల వరకు వెచ్చిస్తున్నా వాటి సంఖ్య తగ్గకపోగా, పెరిగిపోతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నియంత్రణే ధ్యేయందేశవ్యాప్తంగా అనేక నగరాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో కుక్కకాటు బాధితులు, మృతుల సంఖ్య పెరుగుతోంది. ఈనేపథ్యంలో వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు భావించింది. వీధికుక్కల నియంత్రణ కు అన్నిరాష్ట్రాలతోపాటు స్థానిక పట్టణ సంస్థలకు మార్గదర్శకాలతోపాటు ఆదేశాలు జారీచేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో కుక్కలు చొరబడకుండా రెండు వారాల్లోగా ఫెన్సింగ్ వేయించుకోవాలని, మూడు నెలలకు ఒకసారి కుక్కలు ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయా? లేదా? ఎవరినైనా కాటేశాయా? తనిఖీ చేయాలని ఆదేశించింది. కుక్కల నియంత్రణకు కేర్‌టేకర్‌ను నియమించుకోవాలని సూచించింది. వీధులు, బస్టాండ్‌ల్లో వీధికుక్కలు కనిపించకుండా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు చర్యలు తీసుకోవడంతోపాటు వాటిని బయటకు తరలించాలని ఆదేశించింది. వీధికుక్కలకు ఆపరేషన్ చేసిన తర్వాత పట్టుకున్నచోట వదలకుండా రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచాలని స్పష్టంచేసింది. మిగిలిన కుక్కలకు ఫీడింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి నీరు, ఆహారం అందజేయాలని సూచించింది. అధికారుల తర్జనభర్జన సుప్రీంకోర్టు ఆదేశాలు జీవీఎంసీ అధికారుల్లో కలవరం రేపుతున్నాయి. నగర పరిధిలో రెండు లక్షల వరకు ఉన్న వీధికుక్కలను రీహాబిలిటేషన్ సెంటర్లు, ఫీడింగ్ కేంద్రాలకు తరలించాలంటే పెద్ద దింత్రాంగమే అవసరమంటున్నారు. కుక్కలను పట్టుకోవడానికి సిబ్బందితోపాటు తరలించడానికి వాహనాలు సమకూర్చుకోవాలి. వాటిని ఉ ంచడానికి భారీగా కెన్నెల్స్‌ను కొనుగోలుచేయాలి. ఒక కెన్నెల్‌లో రెండు కుక్కలను ఉంచినా లక్ష కెన్నెల్స్ అవసరమవుతాయని, అందుకోసం విశాలమైన స్థలాన్ని గుర్తించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ దశలో దీనిపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధికారులు సమావేశమై సుప్రీంకోర్టు ఆదేశాలపై చర్చించి, ఏం చేయాలనే దానిపై నిర్ణయించే అవకాశం ఉంది.

# పరిష్కరిస్తారా?

**కొన్నాళ్లుగా పట్టణవాసులకు తప్పని ఇబ్బందులు**

**నేడు నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ**

**పై సమస్యలపై దృష్టి సారించాలని విన్నపం**

పార్వతీపురం టౌన్, నవంబరు9పార్వతీపురం మున్సిపాల్టీలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యలకు మోక్షమెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు, పాలకవర్గ సభ్యుల నిర్లక్ష్యం.. 30 వార్డుల్లో ప్రజలకు శాపంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా పై మూడు సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. పట్టణవాసులు నానా అవస్థలు పడు తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నేడు బాధ్యతలు స్వీకరించనున్న నూతన కమిషనర్ కె.కిషోర్‌కుమార్ ఆయా సమస్యలపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..- పార్వతీపురం మున్సిపాల్టీగా ఏర్పడి సుమారు 65 ఏళ్లు పూర్తి కావస్తోంది. గ్రేడ్-1 పురపాలక సంఘంగా ఏర్పడి 25 ఏళ్లు అవుతోంది. అయినా తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారనే చెప్పాలి. సుమారు 58 ఏళ్ల కిందట గరుగుబిల్లి మండలం తోటపల్లి సమీపంలోని నాగావళి నది నుంచి పార్వతీపురం పట్టణానికి నీటి సరఫరా కోసం పథకాన్ని ప్రారంభించారు. అయితే అప్పుడు వేసిన పైప్‌లైన్ పూర్తిగా పాడవడం, లీకులు ఇతరత్రా సమస్యలతో తాగునీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో అన్ని కాలాల్లోనూ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బిందెడు నీటి కోసం పరుగులు పెట్టాల్సి వస్తోది. వేసవిలో వారం రోజులకొకసారి, శీతాకాలంలో నాలుగు రోజులకు , వర్షాకాలంలో అయితే పూర్తిగా బురదనీరు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజారోగ్యం దెబ్బతింటోంది.

- జిల్లా కేంద్రంలో అనధికారికంగా 80 వేలకు పైగా జనాభా ఉంటారనేది వాస్తవం. పట్టణ విస్తరణ శరవేగంగా జరగడంతోపాటు రియల్ ఎస్టేట్ కాలనీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జనాభా సంఖ్య మరింత పెరుగుతుంది. అయితే పారిశుధ్య నిర్వహణ అనేది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తుండగా.. కాలువలు పూడికలతో నిండాయి. మున్సిపాల్టీలో శాశ్వత, కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు 130 మందే ఉండడంతో వారిపై పనిభారం పెరుగుతోంది.

- పట్టణంలో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. సుమారు 15 ఏళ్ల కిందట ప్రైవేట్ వ్యక్తులకు ఈ బాధ్యతలు అప్పగించారు. అయితే సెంటర్ లైటింగ్, వీధి లైట్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో దీపాలు ఎప్పుడు వెలుగుతాయే తెలియని పరిస్థితి. మరోవైపు ప్రైవేట్ సంస్థకు మున్సిపాల్టీ సుమారు రూ.20 లక్షల వరకు బకాయి పడింది. లైటింగ్ నిర్వహణ చేపడుతున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. మొత్తంగా రాత్రి వేళల్లో పట్టణవాసులకు అవస్థలు తప్పడం లేదు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

నెల్లిమర్ల, నవంబరు 9: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. బొప్పడాం పంచాయతీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శనివారం రాత్రి మండలంలోని బొప్ప డాంలో మనప్రజలతో- మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా బొప్పడాంతోపాటు బుచ్చన్నపేటలో పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, టీడీపీ నాయకులు బొంతు వెంకటరమణ, అంబల్ల సత్యనారాయణ, అంబళ్ల అనసూయ, కోరాడరమేష్,అంబల్ల అప్పలనాయుడు, గోవిందరావు, గదల అచ్చెంనాయుడు, దుర్గాసి శేఖర్, సర్పంచ్ అంబల్ల కిరణ్, ఎంపీటీసీ పురుషోత్తం పాల్గొన్నారు.



రహదారిని అభివృద్ధిచేయాలి

భోగాపురం, వంబరు9 భోగాపురం నుంచి ముక్కాం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో తుప్పలు తొలగింపు పనులను ఎమ్మెల్యే లోకంనాగమాధవి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల తుప్పలు పెరిగి పోవడంతో రాకపోకలు సాగించేవారికి ఇబ్బందికరంగా ఉ ందని తెలిపారు. వాహనచోదకులకు ఇబ్బందులుకలకుండా ఉండేలా తుప్పలు పూర్తిగా తొలగించి రహదారి అభివృద్ధి చేయాలని సూచించారు.

# సినిమా



## నటి మీనా ఆసక్తికర వ్యాఖ్యలు

సీనియర్ హీరోయిన్ మీనా గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళంలోనూ సినిమాలు చేసిందీ అందాల తార. స్టార్ హీరోలతో కలిసి సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తెలుగుతో అయితే మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, రజినీ వంటి స్టార్ హీరోలతో అనేక బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది. దక్షిణాదిలో అత్యధిక డిమాండ్ ఉన్న కథానాయికగా చక్రం తిప్పిన మీనా ఇప్పటికీ సినిమాల్లో నటిస్తోంది. ఓ వైపు సీనియర్ హీరోలకు హీరోయిన్ గా నటిస్తోన్న ఆమె మరోవైపు సహాయక నటిగానూ మెప్పిస్తోంది. కాగా దక్షిణాదిలో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన మీనా హిందీలో ఒకే సినిమాలో నటించింది. పర్దా హై పర్దా అనే ఒకే ఒక మూవీ లో చేసిన ఈ అందాల తార ఆ తర్వాత అవకాశాలు వచ్చినా నో చెప్పింది. ముఖ్యంగా ఓ స్టార్ హీరో అయితే పలుమార్లు తనతో సినిమా చేయమని కోరినా.. చేయలేకపోయిందట. ఒకానొక దశలో ఆయన ఉన్న హొటల్‌కి వెళ్లాలంటే భయపడ్డానని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఈ ముద్దుగుమ్మ తాను హిందీ సినిమాలు ఎందుకు చేయలేదో వివరించింది. 'నేను తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేశాను. అదే సమయంలో హిందీ ఆఫర్స్ కూడా వచ్చాయి. కానీ చేయలేకపోయాను. ఇక్కడే నాకు తినడానికి, నిద్రపోవడానికి కూడా సమయం దొరకలేదు. ఇక బాలీవుడ్ సినిమాలు ఎలా చేస్తా. పైగా అక్కడ టైమ్‌కి షూటింగ్ లు పూర్తి కావని తెలిసింది. హిందీలో ఒక్క సినిమా చేసేలోపు సౌత్‌లో నాలుగు సినిమాలు చేయొచ్చని చెప్పారు. అందుకే నేను బాలీవుడ్‌పై పెద్దగా ఫోకస్ చేయలేదు . అప్పట్లో బాలీవుడ్ హీరో మిథున్ చక్రవర్తికి ఊటీలో ఒక హొటల్ ఉండేది. సినిమా షూటింగ్స్ అన్నీ అక్కడే జరిగేవి. నా సినిమా షూటింగ్ కోసం అక్కడి వెళ్తే.. అదే హొటల్‌లో ఉండేదాన్ని. అప్పుడు మిథున్ చక్రవర్తి నా దగ్గరకు వచ్చి మరీ..'నాతో సినిమా ఎప్పుడు చేస్తావ్' అని అడిగేవాడు. నాకు చేయాలనే ఉండేది..కానీ డేట్స్ ఖాళీగా ఉండేవి కాదు. నేను వెళ్లిన ప్రతిసారి ఆయన నా గది దగ్గరకు వచ్చి మరీ అడిగేవాడు. దీంతో నాకు ఏం చెప్పాలో అర్థమయ్యేది కాదు. ఒకానొక దశలో ఆ హీరో హొటల్‌కి వెళ్లాలంటేనే భయపడేదాన్ని. అంత పెద్ద స్టార్ హీరోకి నో చెప్పలేక మనసులోనే బాధపడేదాన్ని. ఎప్పుడైనా ఊటీకి వెళితే.. ఆ హొటల్ వద్దు..వేరే హొటల్‌లో రూమ్ బుక్ చేయమని నిర్మాతలను అడిగేదాన్ని. ఆయనకు నొ చెప్పాలంటే ఏదోలా అనిపించేంది' అని అప్పటి సంగతులను గుర్తు తెచ్చుకుంది మీనా.





## ఈ పండ్లు ఎక్కడ కనిపించినా వదలకండి..

!మల్బరీలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. మల్బరీ తినడం వల్ల సీజనల్ ఇన్ఫెక్షన్లు మొదలైన వాటితో పోరాడటానికి, నివారించడంలో సహాయపడుతుంది. మల్బరీస్ చిన్నగా కనిపించినప్పటికీ, మీ బరువును తగ్గించడంలో చాలా సహాయపడుతుంది. ఎముకల బలానికి ఇనుము, కాల్షియం చాలా ముఖ్యమైనవి. ఈ రెండు పోషకాలు మల్బరీలో ఉంటాయి. కాబట్టి వీటిని తినడం వల్ల ఎముకలు బలహీనపడకుండా ఉంటాయి.
ఈ చిన్న జ్యుసి పండ్లు మీ హృదయాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి కూడా సహాయపడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. మల్బరీలో యాంటీ ఆక్సిడెంట్లు మరియు విటమిన్ సి లభిస్తాయి. ఈ రెండూ చర్మానికి చాలా మేలు చేస్తాయి. ఈ వేసవి పండ్లు ఎక్కడ కనిపించినా వదలకండి..మల్బరీలో పొటాషియం, మాంగనీస్, మెగ్నీషియం, ఫాస్పరస్, సోడియం, జింక్ , విటమిన్ సి, ఇ, కె, %దీ1, దీ2, దీ3, దీ%6, ఫోలెట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పాలీఫెనాల్ పిగ్మెంట్ యాంటీఆక్సిడెంట్లు, లిపిడ్లు, ప్రోటీన్, డైటరీ ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటాయి. మల్బరీలు తీసుకోవటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. మల్బరీ పండ్లోల జీర్ణక్రియకు మేలు చేసే డైటరీ ఫైబర్ అధికంగా ఉ ంటుంది. ఇది పేగు కదలికలను సులభతరం చేస్తుంది. మలబద్ధకం, ఉబ్బరం, కడుపు తిమ్మిరి సమస్యలను దూరం చేస్తుంది. మల్బరీలు బరువు తగ్గడానికి సహాయపడతాయి. మల్బరీ పండ్లలో క్యాన్సర్ కణాలను నిర్మూలించే ఆంథోసైనిన్‌లు ఉంటాయి. వీటిలో రెస్వెరాట్రాల్ కూడా ఉంటాయి.
వీటికి క్యాన్సర్ నిరోధక లక్షణాలు ఉంటాయి. తద్వారా పెద్దప్రేగు క్యాన్సర్, చర్మ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్లతో పోరాడటానికి సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గుండె నుంచి ఇతర భాగాలకు రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంటుంది. ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని ప్రొత్సహిస్తుంది. మల్బరీలు రోగనిరోధక వ్యవస్థను అప్రమత్తంగా ఉంచుతాయి.
మల్బరీలో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. మల్బరీలో విటమిన్ కె, కాల్షియం, ఐరన్ ఎముక కణజాలం, ఎముకలను నిర్మించడానికి తోడ్పడతాయి. ఎముక క్షీణత, బోలు ఎముకల వ్యాధి, ఆర్థరైటిస్ వంటి సమస్యల నుంచి రక్షిస్తాయి. ఇటలీకి చెందిన ఎఫ్. డి రిటిస్ ఇన్‌స్టిట్యూట్ %డ% కాథలిక్ యూనివర్సిటీ ఆఫ్ సేక్రేడ్ హార్ట్ నిర్వహించిన అధ్యయనంలో.. మల్బరీలను తమ రోజువారీ డైట్ ప్లాన్‌లో 1,300 కేలరీలు తీసుకునే వారు, దాదాపు మూడు నెలల వ్యవధిలో వారి మొత్తం శరీర బరువులో 10% తగ్గించుకుంటారని తెలిపింది.



## ఎవరు దూరంగా ఉండాలో తెలుసా?

చలికాలంలో అనేక రకాల కూరగాయలు మార్కెట్‌లోకి వస్తాయి. వీటిలో చాలా వరకు పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ప్రజలు వాటిని ఎక్కువగా తింటారు. కూరగాయలు తినడం వల్ల మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతారు.. అలాగే, మునగకాయను ప్రోటీన్ నిల్వగా పిలుస్తారు. దీని వినియోగం అనేక రకాల వ్యాధులలో ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ, కొందరికి దీని వినియోగం హానికరం అవుతుంది. ఎలాంటి సమస్యలు ఉన్నవారు మునగకాయ తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం..
ప్రతి పండు, కూరగాయలకు దాని ప్రయోజనాలతో పాటు ప్రతికూలతలు కూడా ఉ న్నాయి. అదేవిధంగా,మునగకాయలో కూడా కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. దీని కారణంగా కొన్ని వ్యాధులలో దీనిని తీసుకోవడం మీకు హానికరం.
గర్భిణీ స్త్రీలు: గర్భిణీ స్త్రీలు మునగకాయలు తినకూడదు. నిజానికి, ఇందులో కేలరీలు ఉంటాయి. కాబట్టి, దీనిని అధికంగా తీసుకోవడం హానికరం. అధిక రక్తస్రావం సమస్యలు ఉన్న మహిళలు కూడా దీనిని అధికంగా తినకూడదు.తక్కువ రక్తపోటు: తక్కువ రక్తపోటు ఉన్నవారు మునగకాయలు తినకుండా ఉండాలి. నిజానికి, దీని వినియోగం అధిక రక్తపోటులో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది అధిక రక్తపోటును త్వరగా తగ్గించడంలో సహాయపడుతుంది. అందువల్ల, తక్కువ రక్తపోటు ఉన్నవారు దీనిని తినకుండా ఉండాలి.
గ్యాస్ట్రిక్, అల్సర్లు: గ్యాస్, అల్సర్ వంటి సమస్యలు ఉన్నవారు కూడా మునగకాయలు తినకుండా ఉండాలి.
తల్లిపాలు ఇవ్వడం: బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లులు మునగకాయ వంటకాలు తినకూడదు. తల్లిపాలు ఇస్తున్న ఏ స్త్రీ అయినా ఎట్టి పరిస్థితుల్లోనూ మునగకాయ తినకూడదని నిపుణులు చెబుతున్నారు.


## ఉంచుతారా, తప్పిస్తారా..?

కొత్త ఐపీఎల్ సీజన్ కోసం ఉత్సాహం మరింత పెరిగింది. ఎందుకంటే, నిలుపుదల గడువు కొన్ని రోజుల్లోనే సమీపిస్తోంది. కొత్త సీజన్ కోసం వేలానికి ముందు, 10 ఫ్రాంచైజీలు తమ నిలుపుకున్న, విడుదల చేసిన ఆటగాళ్ల జాబితాలను నవంబర్‌లో విడుదల చేస్తాయి. అయితే, నిలుపుదల ప్రకటించకముందే, కొంతమంది ఆటగాళు ్ళ తమ మైదానంలో ప్రతిభతో ఫ్రాంచైజీ యజమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. రంజీ ట్రోఫీలో ప్రాణాంతక బౌలింగ్ ప్రదర్శించిన ఢిల్లీ ఫాస్ట్ బౌలర్ సిమర్జీత్ సింగ్ కూడా ఉన్నారు.
ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో భాగమైన ఫాస్ట్ బౌలర్ సిమర్‌జీత్ సింగ్ గత సీజన్‌లో పేలవంగా ఆడాడు. పెద్దగా అవకాశాలు రాలేదు. కాబట్టి, కావ్య మారన్ జట్టు ఈ సీజన్‌లో ఈ ఢిల్లీ పేసర్‌ను నిలుపుకుంటుందా లేదా అనేది సిమర్‌జీత్ మనస్సులో మెదులుతున్న ప్రశ్న. అయితే, ఈ నిర్ణయం తీసుకునే ముందు, సిమర్‌జీత్ మైదానంలో తన బౌలింగ్‌తో తన వాదనను బలపరిచాడు. జట్టుకు కూడా సహాయం చేశాడు.
సిమర్జీత్‌కు ఇది రెండో ఫిఫర్..
2025 రంజీ ట్రోఫీలో తమ నాల్గవ మ్యాచ్‌లో ఢిల్లీ ఇన్నింగ్స్ కేవలం 211 పరుగులకే కుప్పకూలింది. అయితే, జమ్మూ కాశ్మీర్ కూడా కేవలం 46 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. నాలుగు వికెట్లలో మూడు వికెట్లు తీసిన సిమర్‌జీత్ సింగ్ జమ్మూ కాశ్మీర్ పేలవమైన ఆరంభానికి కారణమయ్యాడు. అయితే, జమ్మూ కాశ్మీర్ కెప్టెన్ పరాస్ డోగ్రా తన 33వ ఫస్ట్-క్లాస్ సెంచరీని సాధించి జట్టును నిలబెట్టాడు. కానీ, సిమర్జిత్ మరోసారి ఇన్నింగ్స్ పెద్దగా మారకుండా నిరోధించడానికి పోరాడి, వారిని 310 పరుగులకే ఆలౌట్ చేశాడు. 27 ఏళ్ల ఢిల్లీ పేసర్ తన అద్భుతమైన 16.2 ఓవర్ల స్పెల్‌లో 52 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లో సిమర్జిత్ ఒక ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు పైగా పడగొట్టడం ఇది రెండోసారి మాత్రమే.
అతని పేరు ఐపీఎల్ రిటెన్షన్ జాబితాలో చేరుతుందా లేదా విడుదల చేస్తారా?
తన బౌలింగ్‌తో సిమర్జీత్ ఢిల్లీ జట్టు పెద్ద ఆధిక్యంలోకి వెళ్లకుండా అడ్డుకున్నాడు. కానీ, ఇది అతని ఐపీఎల్ నిలుపుదలపై ప్రభావం చూపుతుందా లేదా అనేది ఇంకా తెలియాల్సి ఉంది. గత వేలంలో %కా=న% ఈ బౌలర్‌ను 1.50 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. కానీ, అతను సీజన్ మొత్తంలో నాలుగు మ్యాచ్‌లు మాత్రమే ఆడి రెండు వికెట్లు పడగొట్టాడు. 14 ఎకానమీ రేటుతో పరుగులు ఇచ్చాడు. వచ్చే సీజన్ లో అతనికి %కా=న% తో అవకాశం వస్తుందో లేదో చూడాలి.



## 20 జట్లు.. 5 వేదికలు.

వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరగనున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026 కోసం వేదికలను దాదాపుగా ఖరారు చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, మెగా టోర్నమెంట్‌లోని కీలక మ్యాచ్‌లకు సంబంధించిన వేదికలపై ఒక స్పష్టత వచ్చింది.
ముఖ్య వేదికలు, మ్యాచ్‌లు:
ఫైనల్ మ్యాచ్: క్రికెట్ ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియం అయిన గుజరాత్‌లోని అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది.
టోర్నమెంట్ ఆరంభ మ్యాచ్ (ఓపెనర్) కూడా ఇదే స్టేడియంలో జరిగే అవకాశం ఉ ంది.
సెమీ-ఫైనల్: ముంబైలోని చారిత్రాత్మక వాంఖడే స్టేడియం ఒక సెమీ-ఫైనల్ మ్యాచ్‌కు వేదిక కానుంది.
శ్రీలంక జట్టు సెమీ-ఫైనల్‌కు చేరుకుంటే, ఆ మ్యాచ్‌ను కొలంబోలో నిర్వహించే అవకాశం ఉంది.
భారత్‌లోని ఇతర వేదికలు:
అహ్మదాబాద్, ముంబైతో పాటు ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాలను కూడా భారత్‌లో మ్యాచ్‌ల నిర్వహణకు షార్ట్‌లిస్ట్ చేశారు. ఒక్కో వేదికలో కనీసం 6 మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.
అయితే, తెలుగు రాష్ట్రాలైన హైదరాబాద్ (రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం) లేదా విశాఖపట్నం స్టేడియాలకు ఈ జాబితాలో చోటు దక్కకపోవడంపై అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.
పాకిస్థాన్ మ్యాచ్‌ల పరిస్థితి:
భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా, పాకిస్థాన్ జట్టు ఆడే అన్ని మ్యాచ్‌లను శ్రీలంక వేదికల్లోనే నిర్వహించాలని నిర్ణయించారు.
ఒకవేళ పాకిస్థాన్ జట్టు ఫైనల్‌కు చేరుకుంటే, అప్పుడు తుదిపోరు అహ్మదాబాద్‌లో కాకుండా కొలంబో (శ్రీలంక)లో జరగనుంది.
టోర్నమెంట్ వివరాలు:జట్లు: ఈసారి ప్రపంచ కప్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా మొత్తం 20 జట్లు పాల్గొంటాయి.ఫార్మాట్: ఈ 20 జట్లను ఐదు జట్ల చొప్పున నాలుగు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూపులో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8కి అర్హత సాధిస్తాయి. అనంతరం సెమీస్, ఫైనల్ జరుగుతాయి.ఐసీసీ త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి, అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించనుంది.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .H NO : 21-119, WEST IBRAHIMPATNAM, KRISHNA, ANDHRA PRADESH - 521456.. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.